## క్లుప్తంగా

### నేడు పాఠశాలల్లో డీవార్మింగ్ డే

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల్లో గురువారం డీవార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీ వార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారని చెప్పారు. 6–18 సంవత్సరాలలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్న భోజనం తర్వాత మింగించాలన్నారు. కార్యక్రమాన్ని డీవైఈఓ, ఎంఈఓ, హెచ్ఎంలు పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### అన్నదాతలకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి

**ఐరాల:** ఆర్‌బీకే సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఏడీఏ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం నాగంవాండ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ తప్పనిసరిగా కియోస్క్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. పంట వివరాలను సేకరించి ఈ–క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**యాదమరి:** నేషనల్ డి వార్మింగ్ డే పోస్టర్‌ను సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు బుధవారం ఆవిష్కరించారు. ఉదయం ఆస్పత్రి ఆవరణలో వైద్యులు అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఆవిష్కరించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందికి వైద్యాధికారి సమావేశం నిర్వహించారు. ఈనెల 10నుంచి 17వ తేదీ వరకు మండల పరిధిలో ఆల్బెండజోల్ పంపిణీ చేయాలన్నారు.

### అమర్ జవాన్ స్థూపం ప్రారంభం రేపు

**చిత్తూరు కార్పొరేషన్:** నగరంలోని తిరుత్తణి బస్టాండ్ సమీపంలో ఆర్మీ అమర్ జవాన్ స్థూపాన్ని జిల్లా ఇంచార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

### చిత్తూరు ఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు బంద్

**చిత్తూరు అర్బన్:** చిత్తూరులోని పీసీఆర్ కూడలి నుంచి కొత్తబస్టాండ్ వైపు వెళ్లే ఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనులు జరుగుతుండడంతో బుధవారం అధికారులు ఆ వైపు రాకపోకలను నిలిపివేశారు. మరమ్మతుల పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా బ్రిడ్జిపై వాహనాలు వెళ్లవచ్చని తెలిపారు. వాహనదారులు వీటిని గమనించి అధికారులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

**చిత్తూరు కలెక్టరేట్:** ఎన్జీఓ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను డీఈఓ విజయేంద్రరావు ఆవిష్కరించారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులు విచ్చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి మురళి కోరారు.

### వినాయకుని దర్శించుకున్న తెలంగాణ డీఐజీ


డీఐజీ మహేందర్‌రెడ్డికి స్వామి చిత్రపటం అందిస్తున్న అధికారులు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని తెలంగాణ పోలీస్ శాఖ డీఐజీ మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

### న్యాయం చేయండి

**చిత్తూరు రూరల్:** తమ అనుభవంలోని భూమిని శ్మశానానికి కేటాయించారని పెనుమూరు మండలం గంగుపల్లెకి చెందిన పెద్దబ్బ కుటుంబసభ్యులు అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామపరిధిలో తమకు 0.47 సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమిని పంచాయతీ కార్యదర్శి చదును చేసేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నామని చెప్పారు. తమ భూమిని శ్మశానానికి కేటాయించారని, న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కాణిపాకంశివాలయంలో దేవదేవేరులు



కందగిరి కొండపైన స్వామివారు



వజ్రాలపురంలో..



# మురుగన్‌కు హరోహర

- భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక
- కావళ్లతో మొక్కులు చెల్లింపులు
- సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

అరగొండలో ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు


వసంతాపురంలో కావళ్లు తీసుకెళ్తున్న భక్తులు


అరగొండ దేవస్థానంలో అర్చకుల ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

**తవణంపల్లె:** అరగొండలో వెలసియున్న శ్రీ స్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో బుధవారం ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు సుబ్రమణ్యంస్వామికి భక్తులు కావళ్లు ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా తవణంపల్లె శ్రీసుబ్రమణ్యం స్వామి దేవాలయంలో భక్తులు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకొన్నారు. బుధవారం రాత్రి పుష్పపల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. అరగొండ ఆడికృత్తిక ఉత్సవాల్లో పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాబుకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శనం కల్పించారు.

**చిత్తూరు కల్చరల్:** నగరంలో బుధవారం ఆడికృత్తికను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరోహర నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు కావళ్లతో వళ్లిమలై, తిరుత్తణి ఆలయాలకు కావళ్లు ఎత్తి మొక్కులు చెల్లించారు. నగరంలోని చెంగల్రాయకొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి సుబ్రమణ్యస్వామిని కొలిచారు. చెంగల్రాయకొండ కిటకిటలాడింది. ఆడి మహోత్సవంలో భాగంగా రాత్రి స్వామివారు నగర వీధుల్లో విహరించారు. చెంగల్రాయ కొండపై ప్రారంభమైన ఊరేగింపులో స్వామివారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు.

**వేడుకగా పుష్పకావళ్లు**

**యాదమరి:** మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఆడికృతిక సందర్భంగా బుధవారం మురుగన్‌కు పుష్పకావళ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి


స్వామికి పూజలు చేసి కావడి చెల్లింపులు చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సమర్పించారు. కావళ్లను స్థానిక భజన మందిరం వద్దకు తీసుకొచ్చి గ్రామ పురవీధులలో ఊరేగించారు. అనంతరం తిరుత్తణిలోని మురుగన్ దేవాలయానికి వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ అనుబంధ శివాలయంలో వెలసిన శ్రీవల్లి మురుగునికి ఆడికృతిక సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు.

**మార్మోగిన హరోహర నామస్మరణ**

**గుడిపాల:** మండలంలో హరోహర నామస్మరణ మార్మోగింది. కందగిరికొండ వద్ద వెలసి ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయానికి భక్తులు కావళ్లు ఎత్తి మొక్కులు తీర్చుకున్నారు.

**వజ్రాలపురంలో ఘనంగా ఆడికృత్తిక**

**బంగారుపాళెం:** వజ్రాలపురం బోయకొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే జలకంఠేశ్వరస్వామి, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మొగిలి శివాలయంలోనూ భక్తులు కావళ్లు ఎత్తి మొక్కులు చెల్లించుకున్నారు.


పెరుమాళ్లపల్లెలో పుష్పకావళ్లు


గ్రామోత్సవంలో ఊరేగుతున్న స్వామివారు

**అగస్తీశ్వరస్వామి ఆలయంలో..**

**చిత్తూరు రూరల్:** నగరంలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో ఆడికృత్తిక ఉత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. ఉదయం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు..

## వార్డు స్థానాలకు నామినేషన్లు

**బంగారుపాళెం:** మండలంలో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాలకు గురువారం సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్లు దాఖలు చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి బుధవారం తెలిపారు. నల్లంగాడు పంచాయతీలో 2వ వవార్డు, సదకుప్పం పంచాయతీలో 4వ వార్డు, మొగిలివారిపల్లె పంచాయతీలో 2వ వార్డుకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 12వ తేదీ స్క్రుటినీ, 13న అప్పీల్, 14వ తేదీ మధ్యాహ్నం వరకు నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన చేస్తామన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్, మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌంటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్టేజ్ ఒన్ అధికారి నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

**ఐదవ వార్డుకు నామినేషన్**

**కాణిపాకం(యాదమరి):** కాణిపాక పంచాయ


నామినేషన్ వేస్తున్న మౌనిక

తీలో ఐదవ వార్డుకు మౌనిక అనే అభ్యర్థి బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. కాణిపాకం పంచాయతీలో ఐదవ వార్డు ఖాళీగా ఉండడంతో ఆ స్థానం కోసం ఉదయం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి వద్ద నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు సౌందర్ రాజన్, సుధీర్, షణ్ముగం, వివేక్ పాల్గొన్నారు.

## ప్రభాకర్‌రెడ్డి సేవలు మరవలేనివి

**పూతలపట్టు:** డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సేవలు మరవలేవని అమరరాజ అధినేత గల్లా రామచంద్రనాయుడు తెలిపారు. అనారోగ్యకారణంగా ప్రభాకర్‌రెడ్డి మరణించడంతో బుధవారం వారి స్వగ్రామమైన పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డిపల్లిలో బంధువులు దహనక్రియలు నిర్వహించారు. గల్లా మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి బంగారుపాళ్యంలో నిరుపేదలకు 40 సంవత్సరాలపాటు వైద్యసేవలు అందించారన్నారు. హఠాత్తుగా మరణించడం చాలా బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి, రాష్ట్ర పాల ఏకరి చైర్మన్ కుమార్


ప్రభాకర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న గల్లా రామచంద్రనాయుడు

రాజా, పరమేశ్వర్‌రెడ్డి, మల్లకుంట బాబురెడ్డి, గౌహతిరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్ నివాళులర్పించారు.




**కాణిపాకం (యాదమరి):** కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రధాన ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం పుష్పపల్లకిలో ఊరేగించారు. ఉభయదారులుగా కాణిపాకంకు చెందిన వాయపందలార్ వంశస్తులు వ్యవహరించారు. ఆలయ అధికారులు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పరంజ్యోతి


పరంజ్యోతి

**చిత్తూరు కలెక్టరేట్:** ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డీఈఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరంజ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం బుధవారం ప్రకటించారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

### పాడి పశువులపై అవగాహన అవసరం


పాడిపశువులకు వైద్యశిబిరం

**గుడిపాల:** పాడి పశువులపై రైతులకు అవగాహన చాలా అవసరమని బొమ్మసముద్రం పశు వైద్యాధికారి రవితేజ అన్నారు. బుధవారం చింతగుంటూరులో పశువులకు వైద్యశిబిరం నిర్వహించారు. సిబ్బంది కిషోర్, జ్యోత్స్న, పావని పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**వి.కోట:** పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ ఆశీర్వాదం బుధవారం సాయంత్రం తెలిపారు. మండలంలోని కొంగాటం పంచాయతీ జేబీ కొత్తూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేశారు. దాడిలో ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.21వేలతోపాటు ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

### జాబ్ చార్ట్ ప్రకారం విధుల నిర్వహణ

**రొంపిచెర్ల:** గ్రామ సచివాలయ సిబ్బంది జాబ్ చార్ట్ విధులను సక్రమంగా నిర్వర్తించాలని డీఎల్‌డీఓ రవికుమార్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని చిచ్చిలివారిపల్లె, పెద్దమల్లెల, రొంపిచెర్ల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. అర్హులకు ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలని, వివిధ రకాల ధ్రువపత్రాలను సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు.

## నా భూమి–నాదేశం ప్రారంభం


పాలకలలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ నాగరాజు

**ఐరాల:** ఉపాధి హామీ పథకం కింద నేటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌ను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ నాగరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నా భూమి- నాదేశం, నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పాలకల పంచాయతీ ఆవరణలో ఎంపీడీఓ శిలాఫలకం ఆవిష్కరించారు. అలాగే పంచ్‌ప్రాణ్ ప్రతిజ్ఞ, వసుధకు వందనం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పంచ్‌ప్రాణ్ భావనను సమగ్ర పరిచేందుకు చేతిలో మట్టి దీపాలను పట్టుకుని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా వసుధకు వందనం కార్యక్రమంలో 75 మొక్కలను నాటారు. వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా గుడ్డిపల్లెకు చెందిన విశ్రాంత ఆర్మీ కమాండర్ ఎం.నటరాజ్‌రెడ్డిని శాలువ, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్య పాల్గొన్నారు.

**విజయవంతంగా నా భూమి–నాదేశం**

**పూతలపట్టు:** మండలంలో 'నా భూమి–నాదేశం' నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. బుధవారం పాటూరు గ్రామంలో ఎంపీడీఓ గౌరి చేతుల మీదుగా 'నాభూమి- నాదేశం' పేరుతో శిలాఫలంగా ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, ఎంపీటీసీ రాణెమ్మ, ఏపీఓ సౌభాగ్యవతి పాల్గొన్నారు.

**ఉపాధి హామీ పథకంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్**

**యాదమరి:** మండలంలోని ఉపాధి హామీ పథకంలో అధికారులు ఆజాదికా అమృత్ మహోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. నాభూమి- నాదేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందావనాల వద్ద శుభ్రం చేసి నేల తల్లికి పూజలు చేశారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఎంపీడీఓ శివరాజ్ పాల్గొన్నారు.

**బీఎన్ఆర్‌పేటలో ..**

**చిత్తూరు రూరల్:** బీఎన్ఆర్‌పేట గ్రామంలో బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి- నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ పరిసరాల్లో మొక్కలు నాటి ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ మురళీమోహన్, సర్పంచ్ త్యాగరాజులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గుండ్లకట్టమంచిలో..**

**బంగారుపాళెం:** చిల్లగుండ్లపల్లె, కాటప్పగారిపల్లె, గుండ్లకట్టమంచి, కల్లూరుపల్లె పంచాయతీలలో బుధవారం నా భూమి- నా దేశం, నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండ్లకట్టమంచిలో ఏర్పాటు చేసిన నా భూమి-నాదేశం శిలాఫలకానికి ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించారు. సర్పంచులు దీప, శ్రీనివాసులు, బాలాజీ, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, ఉపాధి ఏపిఓ కిరణ్ పాల్గొన్నారు.


పాటూరులో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గౌరి


యాదమరిలో భూమికి పూజలు చేస్తున్న అధికారులు


మొక్కలు నాటుతున్న అధికారులు


శిలాఫలకాన్ని ప్రారంభించి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


గుండ్లకట్టమంచిలో..

## అభివృద్ధి పనులు వేగవంతం

**చిత్తూరు అర్బన్:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్తూరు మేయర్ ఎస్.అముద అన్నారు. బుధవారం 39వ డివిజన్ పరిధిలోని గోకులం వీధిలో సీసీ డ్రైనేజీ కాలువ నిర్మాణానికి మేయర్ భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో వార్డుకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇదే డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో నేత ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న మేయర్ అముద

## ఫిష్ ఆంధ్రా షాప్ ప్రారంభం


ఆంధ్రాషాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

**చిత్తూరు అగ్రికల్చర్:** చిత్తూరులోని సంతపేటలో మత్స్యశాఖ సహకారంతో బుధవారం ఫిష్ ఆంధ్రా షాప్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫిష్ ఫుడ్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకుగాను ఫిష్‌షాప్‌ను ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు కూడా అందించి ప్రోత్సాహిస్తోందన్నారు. ఇందులో భాగంగా చిత్తూరు నగరంలో రెండు ఫిష్ ఆంధ్రా షాప్‌లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కార్పొరేటర్లు రెడ్డెప్ప, సహదేవ్, గణేష్, నేతలు నారాయణ,అమర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి


వైద్యపరీక్షలు చేస్తున్న రష్మిత


గర్భిణితో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

**గుడిపాల:** గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత అన్నారు. బుధవారం మరకాలకుప్పంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. దివ్య, యమున, సుజాత, ప్రవీణ్ పాల్గొన్నారు.

**వావిల్‌తోటలో ఫ్యామిలీ ఫిజీషియన్**

**పూతలపట్టు:** వావిల్‌తోట పంచాయతీలో బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ప్రతినెలా 9వ తేదీ ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ బుధవారం పూతలపట్టులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

**ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం**

**ఐరాల:** గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దనే రోగులకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.